

పశువుల లెక్క.. పక్కాగా

- 25వతేదీ నుంచి జాతీయ పశుగణన ప్రారంభం
- ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం, శిక్షణ పూర్తి
- ప్రత్యేక యాప్ ద్వారా డిజిటల్ విధానంలో లెక్కింపు



పశుగణన కోసం రూపొందించబడిన ప్రత్యేక యాప్

జఫర్‌గడ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పశువుల లెక్క ఇకపై పక్కాగా ఉండనుంది. పశుసంవర్ధక శాఖ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. దేశ వ్యాప్తంగా ప్రతీ ఇంటిలో ఎన్ని పశువులు ఉన్నాయో.. లెక్కించేందుకు ఈనెల 25 నుంచి పశుగణన చేపట్టనున్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, ఇలా అన్ని రకాల పశువుల వివరాలను సేకరించి డిజిటల్ విధానంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ప్రతీ ఐదేళ్లకోసారి దేశవ్యాప్తంగా పశుగణన చేపడతారు.. చివరిగా 2018లో 20వ పశుగణన నిర్వహించారు.. జాతీయ స్థాయిలో దేశమంతా అక్టోబరు 25 నుంచి ఫిబ్రవరి 24, 2025 వరకు నాలుగు నెలల పాటు 21వ పశువుల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పక్కాగా పశుగణన కోసం 45 మంది ఎన్యుమరేటర్లు, 23 మంది సూపర్‌వైజర్లను నియమించి పశువుల లెక్కింపు విధానంపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. జిల్లాలో ప్రస్తుతం 1.01 లక్షల తెల్లజాతి పశువులు ఆవులు, ఎద్దులు, 1.19 లక్షల నల్లజాతి పశువులు బర్రెలు లేదా గేదెలు, 6.25 లక్షల గొర్రెలు, 1.25 లక్షల మేకలు ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా పశువైద్యాధికారి నేతృత్వంలో సన్నాహక సమావేశం నిర్వహించి పశుగణన ఉద్యోగ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

పశుగణన విధానం...

పశుగణన కోసం ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. ఇంటి యజమాని వివరాలతో పాటు భూమి, పశువుల వివరాలు, చూడి, పాడి పశువులు, జెర్సీ, ఇతర ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, తదితర మూగజీవాల వివరాలను సేకరిస్తారు. ఆ వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లోడ్ చేసి నమోదు చేస్తారు. సంకర జాతి, దేశీయ జాతి పశుసంపదను వేరు వేరుగా సేకరిస్తారు. ప్రతీ అంశానికి ఒక విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. మొత్తం 71 కాలమ్స్‌లో పశువులకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.



సన్నాహక సమావేశంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారులు

పథకాల రూపకల్పనకు అవకాశం...!

ఈ పశుగణన ద్వారా గతంతో పోల్చితే పశువుల (జీవజాతుల) సంఖ్య ఏమేరకు పెరిగిందనేది తెలిసిపోతుంది. తద్వారా అవసరాల మేరకు పశు వైద్యశాలలు, పశువైద్యులు, సిబ్బంది, మందులు ఉన్నాయా..? పశుజాతుల సంఖ్య వంటి అంశాలను ప్రభుత్వాలు అంచనా వేసుకునేందుకు దోహదపడనుంది. ఈ సర్వే గణాంకాల వివరాలకనుగుణంగా పాడి పరిశ్రమ తీరు, వాటి అభివృద్ధి, పశుగణాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, నిధుల కేటాయింపు, పథకాల రూపకల్పన, అమలు.. వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

పశుగణనకు ఏర్పాట్లు పూర్తి

డాక్టర్ వై. రాధాకిషన్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి, జనగామ



దేశవ్యాప్త పశగణనలో భాగంగా ఈనెల 25 నుంచి జిల్లాలో పశువుల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలో పశుగణనకుగాను 45 మంది ఎన్యుమరేటర్లను, పరిశీలనకు 23 మందిని సూపర్‌వైజర్లను నియిమించి పశుగణన విధానం, పరిశీలనపై శిక్షణ ఇచ్చాం. ఎన్యుమరేటర్లు అక్టోబరు 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 వరకు నాలుగు నెలల పాటు క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వెళ్లి సేకరించిన పశువుల వివరాలను డిజిటల్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నారు. గణన కోసం ఆయా గ్రామాల్లో ఇళ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు, రైతులు, పెంపకందారులు తమకు ఉండబడిన పశువుల వివరాలతో సమగ్ర సమాచారం ఇచ్చి సహకరించాలి.

జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, అక్టోబరు 23(ఆంధ్యజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల హెచ్ఎంలతో కలెక్టర్ ఒరియేంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విజయోస్తు కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. ప్రత్యేక ప్రణాళిక ద్వారా ఉపాధ్యాయులు ముందుకు పోవాలన్నారు. నవంబరు 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి, డిసెంబరు చివరి వరకు సిలబస్ పూర్తి చేయాలన్నారు. అభ్యాస దీపిక పుస్తకంలో ఉన్న ప్రశ్నలపై ప్రతీ శనివారం స్లిప్ టెస్ట్‌లను నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎన్ఏఎస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీఈవో రాము తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

వీసీలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

జనగామ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బీసీ కమిషన్ చైర్మన్ సి. నిరంజన్ అన్నారు. హైదరాబాద్ బీసీ కమిషన్ కార్యాలయం నుంచి బీసీ సభ్య కార్యదర్శి బాలమాయదేవి అధ్యక్షతన చైర్మన్ బుధవారం జూమ్ మీట్ ద్వారా కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ నవంబర్ 2న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హన్మకొండ కలెక్టరేట్‌లో పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు పాల్గొనే విధంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాలలో సామాజిక ఆర్థిక రాజకీయ విశ్లేషణ సర్వేపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చందునాయక్

జనగామ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతు సంఘం నాయకులు బుధవారం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను కేటాయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు 40 కేజీల ధాన్యం మాత్ర మే కాంటా వేయాలని తరుగు పేరుతో రైతుల వద్ద నుంచి ధాన్యంఅదనంగా కాంటా వేయకూడదన్నారు. రైతులకు గన్ని బ్యాగుల కొరత లేకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని, కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను కల్పించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

అభ్యంతరాలకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల, జిల్లా ఆసుపత్రిలో పలు విభాగాలలో పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్‌లిస్ట్ వెబ్‌సైట్‌లో పెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిలో అభ్యంతరాలుంటే ఈ నెల 24 నుంచి 28వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు డాక్యుమెంట్లను జతచేస్తూ రాతపూర్వకంగా జనగామ ప్రభుత్వ వైద్యశాలలోని ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో సమర్పించాలన్నారు. అభ్యంతరాలను పరిశీలించి ఫైనల్ లిస్టును ప్రచురిస్తామన్నారు.

మేడారం హుండీ ఆదాయం 26.81 లక్షలు

- మే నుంచి అక్టోబరు వరకు వచ్చిన కానుకల లెక్కింపు
- వనదేవతలను భారీగా దర్శించుకున్న భక్తులు
- గద్దెల వద్ద రద్దీ

6



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తరిగొప్పుల ఎస్సై శ్వేత బదిలీ

తరిగొప్పుల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తరిగొప్పుల ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న అయ్యాల శ్వేతను వరంగల్ సిటీ క్రైమ్ రికార్డ్ బ్యూరోకు బదిలీ చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తరిగొప్పుల పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా ఇంకా ఎవరినీ కేటాయించలేదు. నూతన ఎస్సై నియామకం అయ్యేవరకు ఎస్‌హెచ్‌వోగా నర్మెట సీఐ అబ్బయ్య విధులు నిర్వర్తించనున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సై



పవన్‌కుమార్

పాలకుర్తి, అక్టోబరు 23 : పాలకుర్తి నూతన ఎస్సైగా దూలం పవన్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి పని చేసిన సాయిప్రసన్నకుమార్ బదిలీ వరంగల్ సీసీఎస్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో వరంగల్ సీసీఎస్ నుంచి పాలకుర్తికి బదిలీపై వచ్చి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలుంటాయని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే చూస్తూ ఊర్కునేది లేదని హెచ్చరించారు.

కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంది

- ఘరానా దొంగలు జైలుకెళ్లాల్సిందే
- ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోంది
- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



బచ్చన్నపేట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొమ్మూరి, మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత

బచ్చన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని, ఇప్పటికే ఆయన కుటుంబం నుంచి ఒకరు జైలుకెళ్లారని, తెలంగాణాలో చేసిన అవినీతికి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు జైలుకెళ్లటం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ సబ్‌యార్డ్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకటాచారి ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా కొమ్మూరి హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా, గ్రూప్-1 పరీక్షలు వాయిదా వేయాలనటం కేటీఆర్‌కు సిగ్గుండాలని ఘాటుగా విమర్శించారు. అధికారం కోల్పోయిన తరువాత బావబామ్మర్దులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, వారిని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్సకు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రతీ ఆరు మాసాలకోసారి విడుదల చేయటం జరుగుతుందన్నారు. ఇండ్లులేని నిరుపేదలకు తొందరలోనే ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్కఇల్లు ఇవ్వలేదన్నారు. రైతులకు సబ్సిడీలన్నీ ఎత్తివేసి ఒక్క రైతుబంధు ఇచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుందన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసి చూపుతారని కొమ్మూరి తెలిపారు. అంతకు ముందు కట్కూరు, బండనాగారం, లక్ష్మాపూర్, బోనకొల్లూరు, కేశిరెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, ఆలీంపూర్, పోచన్నపేట గ్రామాల్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్వేతవెంకటాచారి, పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్‌లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నల్లగోని బాలకిషన్‌గౌడ్, జంగిటి విద్యానాథ్, నల్లనాగుల వెంకటాచారి, ఎండీ మసూద్, ఎద్దు హరీష్, పీఏసీఎస్ సీఈవో బాలస్వామి, ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

- కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జేడీ రాజేందర్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ రాజేందర్ సింగ్

జనగామ కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జేడీ రాజేందర్ సింగ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని, వివిధ రకాల నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. టీఎస్‌కేసీ, బీఎఫ్ఎస్, ఐసెక్టోరియల్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. స్వయంప్రతిపత్తి హోదా గురించి మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో అదృష్టదాయకమని, అటానమస్ ద్వారా విద్యార్థులు ఎన్నో ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. మెరుగైన సౌకర్యాలు అందుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాజేందర్ సింగ్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

డీసీపీ రాజమహేంద్ర నాయక్

జనగామ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాణాసంచా విక్రయ కేంద్రాల అనుమతికి దరఖాస్తు చేసుకోవాలని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ కోరారు. జనగామ ఏసీపీ కార్యాలయంలో బుధవారం బాణాసంచా దుకాణదారులు, రిటైల్ షాపు ఓనర్లు, గోదాముల ఓనర్లతో డీసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ బాణసంచా విక్రయాల కోసం ఆసక్తి కలిగిన వ్యక్తులు అగ్నిమాపక విభాగం అధికారులు జారీ చేసిన ఎన్ఓసీ తో పాటు ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేస్తున్నట్లు స్థల యజమాని అనుమతిపత్రం, నిర్మాణ ఏర్పాటు అయితే పక్కవారి అనుమతితో పాటు పక్క భవన బ్లూప్రింట్, ఎస్‌బీఐ అదాలత్ శాఖలో రూ.800.ల చాలన్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు బాణాసంచా అనుమతులు జారీ చేస్తారన్నారు. అనుమతులు లేకుండా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏసీపీలు పార్థసారథి, భీంశర్మ, సీఐలు దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అబ్బయ్య, ఫైర్ అధికారులు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొడకండ్ల అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో బుధవారం అక్రమంగా నిల్వ ఉంచిన 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసు లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సీహెచ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... బీబీనగర్‌కు చెందిన బానోత్ గణేష్ రేషన్ బియ్యాన్ని కొను గోలు చేసి మండలకేంద్రంలో కిరాయికి తీసుకు న్న ఇంట్లో నిల్వ ఉంచాడు. పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులకు ఇంటి ఎదుట ఉన్న బియ్యం బస్తాలు చూసి అనుమానం రావడంతో ఇంట్లో తని ఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బి య్యాన్ని, బియ్యం తరలింపునకు వినియోగించే వాహనాన్ని జప్తు చేసి గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ధరణి సమస్యలపై ఆర్డీవో సమీక్ష



లింగాలఘణపురంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కొమురయ్య

లింగాలఘణపురం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం జనగామ ఆర్డీవో కొమురయ్య సందర్శించి ధరణి సమస్యలతో పాటుగా పెండింగ్ ఫైళ్ల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సాగునీటి పారుదల శాఖకు చెందిన కెనాల్ నిర్మాణాల కోసం మిగిలిపోయిన చోట్ల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ రవీందర్‌ను ఆదేశించారు. అదే విధంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

రేపు అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంపికలు

- వివరాలు వెల్లడించిన ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

వివరాలు 6లో..

వాన నీటిని ఒడిసి పట్టాలి

- కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అడిషనల్
- సెక్రటరీ శుభోత్ యాదవ్
- గంగాపూర్, నాగిరెడ్డిపల్లిలో నిర్మాణాల పరిశీలన

6

రేపు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంపికలు

వివరాలు వెల్లడించిన ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఈ నెల 25న అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల ఎంపికలు ఉంటాయని ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రామిశ్రా బుధవారం తెలిపారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఏటూరునాగారంలో ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాల, బాలికలు 2024-25 విద్యాసంవత్సరంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. మ్యాన్‌ఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్, ఇండస్ట్రీయల్ రొబోటిక్స్, డిజిటల్ మ్యాన్ ఫాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్, అడ్వాన్స్ సి.యన్‌సి., మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ తదితర కోర్సుల్లో కాలపరిమితి ఏడాది నుంచి 2 ఏళ్ల వరకు శిక్షణ ఉంటుందన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన భవనల్‌లో ఈ నెల 25, ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో 26న ప్రవేశాలకు ఎంపికలుంటాయని తెలిపారు. అర్హులైన, ఆసక్తిగల అభ్యర్థులు టెన్త్ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్, టీ.సీ, ఆధార్ కార్డులతో ఆయా సెంటర్లలో హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజన బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సార్వత్రిక విద్య ఎంతో సులభతరం

ఓపెన్ స్కూల్స్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావు



ఓపెన్ స్కూల్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావు, ఉపాధ్యాయులు

భూపాలపల్లి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక విద్య ఇప్పుడెంతో సులభమైందని ఓపెన్‌స్కూల్స్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్‌లలో ప్రవేశాలపై ప్రచారం చేయడానికి రూపొందించిన పోస్టర్‌ను భూపాలపల్లి పట్టణ పరిధి జంగేడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు మహిళలు, వివిధ వృత్తి పనులవారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంచుకుని ప్రతి ఆదివారం తరగతులకు హాజరు కావచ్చని తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకొనేందుకు ఈ నెల 31 వరకు అవకాశం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిలువేరు అశోక్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సామంతుల వీరన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వనదేవతల హుండీ ఆదాయం రూ.26.81 లక్షలు

మేడారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలకు భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, పూజారుల సమక్షంలో పోలీసుల భద్రత నడుమ నిర్వహించారు. మేడారం కార్యనిర్వహణాధికారి రాజేంద్రం ఆధ్వర్యంలో దేవస్థాన సమావేశ షెడ్డులో సేవా సమితి సిబ్బంది హుండీలను లెక్కించారు. సమ్మక్క పది హుండీల్లో రూ. 13,85,398, సారలమ్మ పది హుండీల్లో రూ. 12,09, 392, పగిడిద్దరాజు హుండీలో రూ. 47,331, గోవిందరాజు హుండీలో రూ. 39,519 సమకూరాయని రాజేంద్రం తెలిపారు. మొత్తంగా 22 హుండీల్లో కలిపి రూ. 26,81,640 వనదేవతలకు భక్తులు కానుకలుగా సమర్పించారన్నారు. ఇవి 2024 27మే నుంచి 2023 అక్టోబరు 2024 వరకు వచ్చిన కానుకలని తెలిపారు. ఈ ఆదాయం మొత్తాన్ని తాడ్వాయి కెనరా బ్యాంకులో దేవస్థానం ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. లెక్కింపు సందర్భంగా సీలు తొలగించిన 22హుండీల స్థానంలో మరో 22హుండీలకు అధికారుల, పూజారుల సమక్షంలో సీలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు సారయ్య, స్వామి సంఘం సభ్యులు రమేష్, రఘుపతిరావు, పూజారులు స్వామి, భోజారావు, నర్సింగరావు, మునీందర్, కృష్ణయ్య, యువరాజు, కిరణ్, జనార్ధన్, రమేష్, దేవాదాయ శాఖ అధికారులు క్రాంతి కుమార్, మధు, రఘుపతిరావు, రాజేశ్వర్‌రావు, వీరన్న, కవిత, జగదీశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వనదేవతల గద్దెల వద్ద రద్దీ

మేడారంలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. వనదేవతల గద్దెల వద్ద రద్దీగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, గద్దెలకు చేరుకున్నారు. పూలు, పండ్లు, చీరె, సారె, బంగారంతో తల్లులకు మొక్కులు సమర్పించారు. సుమారు పదివేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.



వనదేవతల కానుకలను లెక్కిస్తున్న సేవా సిబ్బంది

వాన నీటిని ఒడిసి పట్టాలి

- కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శుభోత్ యాదవ్
- గంగాపూర్, నాగిరెడ్డిపల్లిలో నిర్మాణాల పరిశీలన

బచ్చన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసిపట్టే ప్రక్రియలు కొనసాగించినప్పుడే భావితరాలకు భూగర్భ జలాలు అడుగంటి పోకుండా అందించగలుగుతామని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అడిషన్ సెక్రటరీ శుభోత్ యాదవ్ అన్నారు. బుధవారం బచ్చన్నపేట మండలం గంగాపూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. 2019-20 సంవత్సరంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి రూ. 2.50 కోట్లతో గంగాపూర్, నాగిరెడ్డిపల్లి, పడమటికేశ్వాపూర్ గ్రామాల శివారుల్లో ఆరు చెక్‌డ్యాంలు, ఎనమిది పీజో మీటర్ బోరుబావులు, ఒక భూగర్భ చెక్‌డ్యాం నిర్మాణం, 18 బోర్‌వెల్ రీచార్జ్ బావులు వేశారు.

వాటి ఫలితాలు ప్రస్తుతం ఎలా ఉన్నాయనే విషయం తెలుసుకోవటానికి శుభోత్ యాదవ్, రాష్ట్ర, జిల్లా అధికారుల బృందంతో కలిసి పర్యటించి, పరిశీలించారు. దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రాజెక్టులు ఏపీ, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో మరో మూడు చోట్ల చేపట్టగా, ఇక్కడ విజయవంతం అయినట్టు తెలిపారు. ఇందుకు అనుకూలించిన పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు రావటం జరిగిందన్నారు. స్థానిక రైతుల నుంచి వివరాలు సేకరించారు. ప్రాజెక్ట్ ఏర్పాటుకు ముందు, తరువాత ఎలాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ప్రాజెక్టులు మరికొన్ని మంజూరు చేయాలని డీఆర్డీవో వసంత కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో రూఫ్‌టాప్ రీచార్జ్ పిట్స్‌లకు ప్రణాళికలు తయారు చేసి పంపితే తక్షణం నిధులు మంజూరు చేస్తామని శుభోత్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర భూగర్భ జలబోర్డు దక్షిణ ప్రాంత రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఎంపీడీవో మల్లికార్జున్ క్లస్టర్ టీఏ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



గంగాపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న శుభోత్ యాదవ్

హనుమకొండ చౌరస్తాలో రామ్‌రాజ్ షోరూం ప్రారంభం

హనుమకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వస్త్రరంగంలో ప్రసిద్ధి చెందిన రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ హనుమకొండ చౌరాస్తాలో ఏర్పాటైంది. దీనిని బుధవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించగా, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జ్యోతిప్రజ్వలన గావించారు. 'కుడా' చైర్మన్ ఇ.వెంకట్‌రామ్‌రెడ్డి తొలి కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశం గర్వించేలా అందం, ఆనందం, సంప్రదాయాల మేళవింపుతో, వినియోగదారులను ఆకట్టుకునే తరహాలో వస్త్రాలను విక్రయాలకు సిద్ధంగా ఉంచినట్లు వివరించారు.



షోరూమ్ ప్రారంభోత్సవంలో నేతలు, నిర్వాహకులు

నేడు ఏటూరునాగారంలో కొమురం భీం విగ్రహావిష్కరణ

ఏటూరునాగారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం జరగనుంది. ఈ మేరకు ఆదివాసీ పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమరంభీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. ఆమెతోపాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బీజాపూర్ ఎమ్మెల్యే విక్రం మాండవి, ఏపీ రాష్ట్రం అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొంటారని వివ రించారు. ఆది టవాసీలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ పోరాట యోధులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా స్వరూప



కాటారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం జిల్లా కన్వీనర్‌గా మండలంలోని శంకరంపల్లి గ్రామానికి చెందిన గడ్డం స్వరూప నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాసరావు, కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి బుధవారం నియామ కపత్రం జారీ చేశారు. స్వరూప మాట్లాడతూ తెలంగాణ ఉద్యమకాలంలో నిర్వహించిన కార్యక్రమాలను గుర్తించి కన్వీనర్‌గా నియమించిన ఫోరం రాష్ట్ర, జిల్లా నేతలు చీమ శ్రీనివాస రావు, పటోళ్ల సురేందర్‌రెడ్డి, యెల్ల పోశెట్టి, గడ్డం సుధాకర్, వైద్యుల రజితారెడ్డి, ఉప్పలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజాప్ర భుత్వం ఏర్పడటానికి కృషి చేసిన ఉద్యమకారులను ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించి ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరుతున్నట్లు తెలిపారు.

కాంటిజెంట్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా హరిప్రసాద్



స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంటిజెంట్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా స్టేషన్‌ఘన్‌పూర్ పీహెచ్‌సీ కాంటిజెంట్ వర్కర్ కొలనుపాక హరిప్రసాద్ ఎంపికయ్యారు. హెచ్-1 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌లు బుధవారం హరిప్రసాద్‌కు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కొడిశాల విద్యార్థి



విద్యార్థి సంజయ్

తాడ్వాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిశాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువు తున్న సిద్ధబోయిన సంజయ్ ఇటీవల వరంగల్ జిల్లాస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోలెం దేవదాస్ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు విద్యార్థి సంజయ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈనెల 27నుంచి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సంజయ్ పాల్గొంటాడని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చందా కోటేశ్వర్‌రావు, జగపతిరావు, అజ్మీరా రవీందర్, దేవ్‌లా, ఎస్ చొక్కారావు, మొగుళ్లపల్లి లక్ష్మయ్య, చేల కృష్ణ, ఆర్ వెంకటేశ్వర్లు, ఆలెం అశోక్, కె. శేషగిరి, ఎస్ సాంబయ్య, జి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానవజన్మను సార్థకం చేసుకోవాలి

బాల బ్రహ్మానంద సరస్వతి స్వామిజీ

బచ్చన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో మానవజన్మ అత్యుత్తమమైందని, సార్థకం చేసుకోవాలని నైమిశారణ్య పీఠాధిపతులు బాలబ్రహ్మానంద సరస్వతి స్వామిజీ అన్నారు. శత దేవాలయ ప్రవచన యాత్రలో భాగంగా బుధవారం కొడవటూరు సిద్ధేశ్వరాలయానికి ఆయన చేరుకున్నారు. ఆలయంలో శివలీలామృతంపై ప్రవచనం చేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ఈవో చిందం వంశీ, ప్రధానార్చకుడు ఓంనమఃశివాయ, మహాశివుడు, శ్రీనివాస్, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేటలో ప్రవచనాలు చెబుతున్న బాలబ్రహ్మానంద సరస్వతి స్వామిజీ

బుగులు వెంకన్న ఆలయ సందర్శన

చిలుపూర్ (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికత వైపు దృష్టి సారించి క్రమశిక్షణతో జీవించాలని బాల బ్రహ్మానంద సరస్వతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయాన్ని ఆయన సందర్శించి స్వామివారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రవచనాలు బోధించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఇన్‌చార్జి ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

డీడబ్ల్యూవో ఆఫీస్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

క్రచ్ సెంటర్ల ప్రారంభాన్ని నిలిపివేయాలని డిమాండ్

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అంగన్‌వాడీ సెంటర్లలో కొత్తగా ప్రారంభించనున్న క్రచ్ సెంటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరాహారదీక్షల్లో భాగంగా నాలుగోరోజు ములుగులోని డీడబ్ల్యూవో కార్యాలయ వద్ద ధర్నా చేశారు. ఉద్యోగులు కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సరోజన, కె.సమ్మక్క మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలో క్రష్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా మూడేళ్లలోపు పిల్లలకు టీహెచ్‌ఆర్ ఇస్తున్నారని, మళ్లీ కొత్తగా క్రచ్ ద్వారా బాలల సంరక్షణ పేరుతో కొత్త సెంటర్లను ప్రారంభించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. క్రచ్ సెంటర్లను ఎన్‌జీవోలకు ఇచ్చే ప్రయత్నం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈవిషయంపై ప్రభుత్వం విధివిధానాలను ప్రకటించి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జమునారాణి, రమాదేవి, ధనలక్ష్మి, సూరమ్మ, సరిత, నర్సమ్మ, రేణుక, పుష్ప, ఇందిర, రాంబాయి, దీప తదితరులు పాల్గొన్నారు.



డీడబ్ల్యూవో కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు


మోదీ నుంచి బహుమతి అందుకుంటున్న లక్ష్మీప్రియ


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అందుకుంటున్న లక్ష్మీప్రియ

ప్రధాని మెచ్చిన చైతన్య

ఓరుగల్లు కళాకారిణికి ముద్దుపేరు పెట్టిన మోదీ

- కూచిపూడి నృత్యంతో ప్రశంసలందుకున్న లక్ష్మీప్రియ
- ఈ ఏడాది ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్‌పురస్కార్‌కు ఎంపిక
- ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరణ

కీర్తి పతాక

అది ఢిల్లీలోని ప్రధాన మంత్రి నివాసం. అక్కడి ఓ పేషీలోని గోడకు ఉండే ఒక ఫొటో అందరినీ ఆకట్టుకుంటూ ఉంటుంది. అది ప్రధాని నరేంద్ర మోదీ ఓ చిన్నారితో కలిసి దిగిన ఫొటో. అంతేకాదు తనతో ఫొటోదిగిన ఆ చిన్నారికి ప్రధాని మోదీ చైతన్య అని ఓ ముద్దు పేరు కూడా పెట్టారు. అంతలా మోదీ మెప్పు పొందిన ఆ చిన్నారి ఎవరో కాదు. మన ఓరుగల్లు కీర్తిపతాక పెండ్యాల లక్ష్మీప్రియ. కూచిపూడి నృత్యంలో అసాధారణ ప్రతిభ కనబరిచినందుకు గాను లక్ష్మీప్రియకు ఈ అరుదైన గౌరవం దక్కింది. ఒకటి కాదు... రెండు సార్లు ప్రధానిని కలిసి... ఆయనతో పదిహేను నిముషాలకు పైగా గడిపే మహదావకాశం పొందింది. మూడేళ్ల ప్రాయం నుంచే నాట్యం నేర్చుకోవడం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి చిన్నతనంలోనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకమైన ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డును అందుకుని తెలంగాణ కీర్తిపతాకాన్ని ఢిల్లీ వీధుల్లో ఎగురవేసింది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువు ఆశీస్సులతో నాట్యంలో రాణిస్తున్న లక్ష్మీప్రియ అందరికీ స్ఫూర్తిదాయకం.

హనుమకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : 'నాట్యం నాకు ప్రాణం. కూచిపూడితో పాటు వివిధ నృత్యరీతులను తెలుసుకునేందుకు చారిత్రక నేపథ్యాన్ని తరచిచూడాలి. ఇందులో భాగంగానే వేదాలను కూడా అధ్యయనం చేస్తున్నా. సనాతన ధర్మాన్ని కాపాడడంలో నృత్యం కూడా ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. ఇక డిప్యూటీ కలెక్టర్‌గా రిటైర్ అయిన మా తాత పెండ్యాల కిషన్ అడుగుజాడల్లో నడిచి కలెక్టర్ అయి ప్రజలకు సేవ చేయాలన్నదే నా ఆశయం' అని అంటోంది కూచిపూడి నృత్యకారిణి పెండ్యాల లక్ష్మీప్రియ. హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన రాకేశ్ కుమార్, సాయిలత దంపతుల కూతురైన లక్ష్మీప్రియ ప్రస్తుతం ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. నృత్య నేపథ్యం లేని కుటుంబమే అయినా మూడేళ్ల వయసున్నప్పుడే శాస్త్రీయ నృత్యంపై కూతురికి ఉన్న మక్కువను గుర్తించిన తల్లిదండ్రులు నాట్య గురువు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద చేర్చారు. అనతి కాలంలోనే కూచిపూడిలో ఎంతో నైపుణ్యం సాధించి హైదరాబాద్‌తో పాటు ఏపీ, తమిళనాడు, కర్నాటక, మధ్యప్రదేశ్, భోపాల్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో సుమారు 200లకుపైగా ప్రదర్శనిచ్చింది. కేంద్ర ప్రభుత్వం నుంచి సీసీఆర్‌టీ ఉపకార వేతనాన్ని కూడా అందుకుంటోంది.

విపత్కర సమయంలోనూ ఆగని సాధన

అనుకున్నది సాధించే పట్టుదల కలిగిన లక్ష్మీప్రియ శివానంద నృత్యమాల నిర్వాహకుడు, నాట్య గురువు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద నిరంతరం శిక్షణ తీసుకుంటోంది. కరోనా విప్కర సమయంలోనూ తన సాధనను ఆపలేదు. ఆ సమయంలో పాఠశాలలు బంద్ కావడంతో తన దృష్టినంతా నృత్యం మీదే కేంద్రీకరించింది. అలా కరోనా కాలంలో పడిన కష్టమే ఉత్తమ కళాకారిణిగా ఎదగడానికి దోహదం చేసిందని, నాట్యంతో పాటు చదువులోనూ రాణిస్తోందని గురువు సుధీర్‌రావు ప్రశంసిస్తున్నారు.

ఎన్నో ప్రదర్శనలు.. మెగాస్టార్ ప్రశంసలు..

లక్ష్మీప్రియ కాజీపేటలోని మోన్‌ఫోర్డు సీబీఎస్‌సీ క్యాథలిక్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నప్పుడు ఆ విద్యా సంస్థ యాజమాన్యం నిర్వహించిన అంతర్ పాఠశాలల పోటీలు మాలిక్యూల్ ఫెస్ట్‌లో ప్రదర్శన ఇచ్చి ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ చిన్నారి ప్రతిభను గుర్తించిన పాఠశాల యాజమాన్యం ఆమెకు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచితంగా విద్యనందించింది. వివిఐటీ బాలోత్సవ్‌లోనూ తన ప్రతిభను చాటిన లక్ష్మీప్రియ కాశీలో ఐసీఎండీఏ ఆధ్వర్యంలో గురువు సుధీర్ రావుతో కలిసి శివుని సన్నిధిలో శివతాండవ స్తోత్రానికి కొరియోగ్రఫీ చేసింది. పదివేల మంది ఈ నృత్యంలో పాలు పంచుకున్నారు. వీరి కొరియోగ్రఫీకి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయి. చెన్నయ్‌లో జరిగిన నృత్యపోటీల్లో ఆర్ట్ బుక్ ఆఫ్ రికార్డు, కూచిపూడి, మోహినీ ఆట్టం పోటీల్లో స్పెషల్ బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డు దక్కింది. ఇటీవల మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా హైదరాబాద్ శిల్పకళావేదికలో ఆయన పేరిట నృత్యరూపకాన్ని ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ నృత్యరూపకాన్ని చూసి అబ్బురపడిన చిరంజీవి 'నృత్యం అద్భుతంగా ఉంది' అని ప్రశంసిస్తూ స్వయంగా లేఖ రాశారు.

ప్రధాని నివాసంలో..

2023 ఢిల్లీలోని కాల్‌కటోరా స్టేడియంలో ప్రధాని సమక్షంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పాల్గొని అద్భుత ప్రతిభను కనబరిచిన లక్ష్మీప్రియ మోదీ నుంచి ప్రశంసలు అందుకుంది. 2023లో గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో విజిటర్ వీఐపీగా, 2024లో కర్తవ్యపాత్‌లో బాల్‌పురస్కార్ గ్రహీతలైన 19 మందిలో ఒకరుగా పాల్గొంది. పరేడ్‌లో ప్రత్యేక జీపులో తమను తోడ్కొని వెళ్లడం మరచిపోని జ్ఞాపకం అంటున్న లక్ష్మీప్రియ తనకు భామాకలాపం నృత్యరూపం అంటే ఎంతో ఇష్టమని చెబుతోంది. గతేడాది జాతీయ స్థాయి కళోత్సవ్ పురస్కారం అందుకున్న ఆమె దేశవ్యాప్తంగా అన్ని నృత్యరీతుల్లో జరిగిన ఈ పోటీలో రాష్ట్రం తరుపున కూచిపూడి విభాగంలో ఎంపికైంది. పరీక్షాపే చర్చా కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో ప్రధాని మోదీ లక్ష్మీప్రియ నాట్యాన్ని చూసి అభినందనలు కురిపించారు. కళోత్సవ్‌లో విజేతలైన పిల్లలతో మోదీ తన నివాసంలో కొద్ది సేపు గడిపారు ప్రధాని పేషీలో ఉన్న లక్ష్మీప్రియ ఫొటో ఆ సమయంలో దిగినదే.

దర్శక దిగ్గజం విశ్వనాథ్‌కు నివాళిగా

శాస్త్రీయ నృత్యంలో పలు ప్రయోగాలు చేసి ప్రేక్షకుల మన్ననలను పొందుతున్న లక్ష్మీప్రియ.. దివంగత సినీ దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్‌కు నివాళిగా స్వర్ణకమలంలో 'అందెల రవమిది' పాటకు అదే పేరుతో సొంతంగా ఓరుగల్లులో కాకతీయులు నిర్మించిన ఆలయాల నేపథ్యంగా నృత్యరీతిని రూపొందించింది.



నాట్యగురువు బొంపెల్లి సుధీర్ రావుతో..

ప్రతిష్ఠాత్మక బాల్ పురస్కార్‌కు ఎంపిక

జాతీయ స్థాయిలో తొమ్మిది రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన ఐదు నుంచి పద్దెనిమిదేళ్ల పిల్లలకు పీఎం రాష్ట్రీయ బాల్ పురస్కార్‌ను అందజేస్తారు. ఈ పురస్కారానికి ఈ సారి దేశవ్యాప్తంగా 19 మందిని ఎంపిక చేయగా.. తెలంగాణ నుంచి లక్ష్మీప్రియ ఎంపికైంది. కళలు, సంస్కృతి రంగంలో ఆమెకు ఈ పురస్కారం దక్కగా ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అందుకుంది. బాల్ పురస్కార్ పొందిన పిల్లలను ప్రధాని తన నివాసానికి ఆహ్వానించారు. అలా లక్ష్మీప్రియకు రెండోసారి మోదీని కలిసే అవకావం దక్కింది. ఆమెను చూసిన వెంటనే మోదీ గుర్తుపట్టి 'చైతన్య' అని సంబోధించడం. ఈ క్రమంలో లక్ష్మీప్రియ 'సార్ నా పేరు లక్ష్మీప్రియ అని గుర్తుచేయబోగా నువ్వు చైతన్యవే' అంటూ మోదీ ఆప్యాయంగా తట్టారు. ఇది తన జీవితంలో మరించిపోలేనిది అంటోంది లక్ష్మీప్రియ. ఇక ప్రధాని పేషీలో తన ఫొటో చూసి ఉద్విగ్నానికి గురయ్యానంటోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువు చేయూతతో రాణిస్తూ రాష్ట్రపతి నుంచి రాష్ట్రీయ బాల్‌పురస్కార్ అందుకోవడం తన జీవితంలో మధుర జ్ఞాపకం అంటోంది.

సాక్ష్యం



ఖమ్మం మెట్ | హైదరాబాద్

చెక్కు చెదరని రాతి దిక్సూచి..

పూర్వకాలంలో ఒక ఊరి నుంచి మరో ఊరికి ప్రయాణం సాగించాలంటే రహదారుల వెంబడి పెద్ద పెద్ద రాతి బండలు ఏర్పాటు చేసి వాటిపై ఊర్ల పేర్లు చెక్కడంతో వాటి ఆధారంగా వెళ్లేవారు. ప్రస్తుతం నగరం ఎంత అభివృద్ధి చెందినా.. నాటి తీపి గుర్తులు ఇంకా దర్శనమిస్తున్నాయి. హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డు పక్కన నిజాం కాలంలో ఏర్పాటు చేసిన పురాతన రాతి సూచికపై 'ఖమ్మం మెట్, హైదరాబాద్' అనే అక్షరాలతో చెక్కిన రాతి దిక్సూచి నేటికీ చెక్కు చెదరకుండా దర్శనమిస్తోంది. కాగా, నేటి ఖమ్మం జిల్లా కేంద్రం పేరు నిజాం కాలంలో ఖమ్మంమెట్‌గా పిలుచుకునేవారని చరిత్ర చెబుతోంది. నగర నడిబొడ్డున ఉన్న రాతి దిక్సూచి చాలా మందికి తెలియకపోవచ్చని స్థానికులు చెబుతున్నారు.

- హనుమకొండ చౌరస్తా

వినూత్నం



డ్రాగన్‌కు సీసీ కాపలా

- తోటలో రక్షణకు రైతు వినూత్న ప్రయత్నం

ఎవరైనా ఇళ్లు, కార్యాలయాలు, దుకాణాల్లో చోరీలు జరగకుండా రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం తెలుసు. కానీ భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామానికి చెందిన ఓ రైతు మాత్రం వినూత్నంగా ఆలోచించాడు. తాను కష్టపడి సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటలో దొంగలు పడుతున్నారన్న అనుమానంతో తోట చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఒక్కో కాయ రూ.100పలుకుతుండగా.. పది కాయలు చోరీకి గురైతే రూ.వెయ్యి కోల్పోయినట్లేనని భావించిన ఆయన సీసీ కెమెరాలను అమర్చడం గమనార్హం.

- 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

ఆ పేరెలా వచ్చిందంటే..

చిరస్థాయిగా నిలిచిన డబ్బాలు

అది హనుమకొండ కేయూ నుంచి పెద్దమ్మగడ్డకు వెళ్లే ప్రధాన రహదారి. ఆ రహదారిలో ఉన్న ప్రాంతానికి డబ్బాల జంక్షన్‌గా పేరుంది. ప్రస్తుతం 5, 54 డివిజన్ల మధ్య ఉన్న ఈ డబ్బాల జంక్షన్ కాస్త హనుమాన్‌నగర్‌గా రూపాంతరం చెందింది. 1977లో పెగడపెల్లి జంక్షన్ ప్రాంతంలో కట్కూరి సత్తయ్య సెలూన్ షాపు, రాజయ్య లాండ్రి షాపు, సిరబోయిన కరుణాకర్ సైకిల్ రిపేరింగ్ షాపు, రాజేందర్, రాజకొంరయ్యల చాయ్ హోటళ్లు, బాబు, మల్లమ్మ చిల్లరకొట్లు, భూషణం రామప్పలు పాన్‌షాపులు నడిపేవారు. అయితే అప్పటికే ఈ ప్రాంతంలో పురాతన హనుమాన్ దేవాలయం ఉండడంతో కాలనీ పెద్దలు 1983లో హనుమాన్‌నగర్‌గా నామకరణం చేశారు. కానీ కాలక్రమేనా 1988 నాటికి ఆ ప్రాంతంలో 12 డబ్బాలు ఏర్పడటంతో డబ్బాల జంక్షన్‌గా పేరొచ్చింది. క్రమంగా భూములకు రేట్లు పెరగడంతో చాలామంది ప్లాట్లు కొనుగోలు చేయడంతో ఆ ప్రాంతం రూపురేఖలు మారాయి. 2000 సంవత్సరం నాటికి ఆ డబ్బాలు పోయి చిన్నపాటి షాపులు, షట్టర్లు రాగా ప్రస్తుతం కమర్షియల్ కాంప్లెక్సుల ఏర్పాటుతో కాస్ట్‌లీ ప్రాంతంగా గుర్తింపు వచ్చింది. గజం రూ.1.50లక్ష పలుకుతోంది. కానీ ఆప్రాంతానికి ఉన్న డబ్బాల జంక్షన్ పేరు మాత్రం ఎవరూ మరిచిపోలేదు.



- వరంగల్ కార్పొరేషన్

అదరహో 'ప్రేరణ'

గుబాళించిన ఓరుగల్లు ప్రతిభ



హనుమకొండ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో వరంగల్‌లోని నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రేరణ నృత్య రూపకం ఆహూతులను అలరింపజేసింది. అంతేకాకుండా ప్రత్యేకంగా ఆలోచింపచేసింది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ జ్యోతి వెలిగించి ప్రేరణ నృత్య రూపకాన్ని ప్రారంభించారు. కిక్కిరిసిన రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఆయన మాట్లాడుతూ.. ఒకవైపు ఆధ్యాత్మిక మరోవైపు సామాజిక స్పృహతో చక్కని ఇతివృత్తాన్ని అందిస్తూ ముఖ్యంగా నేటి మహిళాలోకానికి ఒక గొప్ప సందేశాత్మక నృత్యరూపకం ప్రేరణ అని ఆయన అన్నారు. పేరిణి నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణ ప్రియశిష్యులు గజ్జెల రంజిత్ కుమార్ - నవ్యజ దంపతులు అపూర్వ కృషి చేసి ప్రేరణ నృత్య రూపకాన్ని అద్భుతంగా ప్రదర్శింప చేశారని కితాబిచ్చారు.

ప్రేరిణి నాట్య గురువు డాక్టర్ కళా కృష్ణ మాట్లాడుతూ.. నటరాజ రామకృష్ణ శిష్యబృందంలో తనతోపాటు పాలుపంచుకున్న రంజిత్ కుమార్ కృషికి నిదర్శనంగా ఈ ప్రదర్శన నిలుస్తుందని అన్నారు. మహిళలకు గొప్ప స్ఫూర్తినందించే సందేశంతో ప్రేరణ కొనసాగిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రేరణకు విస్తృత ప్రచారం కల్పించిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు గజ్జెల రంజిత్ కుమార్ స్వాగతం పలుకుతూ తమ ఈ కృషికి ఎందరో తమ గురువులు సీనియర్ కళాకారులు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ అలేఖ్య కుంజాల, తెలుగు విశ్వవిద్యాలయ నృత్య విభాగాధిపతి డాక్టర్ వనజ ఉదయ్, కేయూ ప్రొఫెసర్ సురేష్‌లాల్, ప్రేరిణి నాట్య గురువులు కళా కృష్ణతో పాటు బండి కుమార్, దుంపేటి సునీల ప్రకాష్, రాయబారపు శ్రవణ్, గుమ్మడి శ్రావణి, వెంకటపైడారావు, తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.ప్రేరణ నృత్యరూపకంలో వరంగల్‌కు చెందిన 70మంది కళాకారులు తమ అపూర్వ నటనా కౌశల్యాన్ని ప్రదర్శించి పరవశింప జేశారు.

ఆదర్శం

అ'పూర్వ'ం.. వారి సేవాగుణం

- స్కూల్‌కు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- వచ్చే అద్దెలతో స్వచ్ఛంద కార్యక్రమాల నిర్వహణ
- ఆదర్శంగా నిలుస్తున్న శివునిపల్లి పూర్వ విద్యార్థులు



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పిన బడికి ఏదో ఒకటి చేయాలని.. అది కూడా భావితరాలకు ఉపయోగపడేలా ఉండాలని భావించారు ఆ పూర్వ విద్యార్థులు. అనుకున్నదే తడవు గా చేయిచేయి కలిపి పాఠశాల కోసం ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ కాంప్లెక్స్‌ను కిరాయికి ఇచ్చి వచ్చిన అద్దె సొమ్ములతో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తతన్నారు స్టేషన్ ఘన్ పూర్ జంట పట్టణంలోని శివునిపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు. శివునిపల్లి 1952లో హైస్కూల్ ఏర్పాటు జరగ్గా.. ఈ 60ఏళ్లలో ఎంతో మంది చదువుకున్నారు. అలాంటి పూర్వవిద్యార్థులు వందలాది మంది ఏకమయ్యారు. 2005లో సమావేశమై పూర్వ విద్యార్థుల కమిటీని ఏర్పాటు చేసుకుని.. తమవంతుగా కొంత సొమ్ము, మరికొంత సొమ్మును విరాళాల రూపంలో సేకరించారు. ఈ క్రమంలో అద్దెకు తీసుకునే వారితో ముందే ఒప్పందం చేసుకుని వారి నుంచి అడ్వాన్స్‌గా కొంత డబ్బును తీసుకుని.. ఆ మొత్తంతో పాఠశాల ముం దున్న స్థలంలో 9గదులతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి.. అద్దెకు ఇచ్చారు. ఆ గదులకు కిరాయి రూపంలో వస్తున్న ఆదాయాన్ని పాఠశాల అత్యవసరాలకు, మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడానికి వినియోగిస్తున్నారు. అయితే తొలి రెండేళ్ల పాటు అద్దెలు తీసుకున్న వారి నుంచి అడ్వాన్స్‌గా తీసుకున్న మొత్తానికి సరి పోగా.. ఆ తర్వాత నుంచి వచ్చిన కిరాయి సొమ్ములను బ్యాంకులో జమ చేసి, పాఠశాల మౌలిక వసతులకు, అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ఏడాదికి రూ.లక్ష వరకు అద్దె ఆదాయం వస్తోంది.

కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు..

2005లో పాఠశాలలో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తమ కమిటీ ఆధ్వర్యంలో హెచ్ఎం విజయ ద్వారా చర్యలు తీసుకున్నారు. ఆతర్వాత తలా కొంత సేకరించి మొత్తం రూ.5లక్షలు పోగుచేసి పాఠశాలకు వరండా నిర్మించారు. కంప్యూటర్ సీపీయూ, మానిటర్లు అందజేశారు. ఏటా జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇస్తున్నారు. రూ20 వేల విలువైన నోట్ బుక్స్ అందించారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు రూ.5వేలు, పాఠశాలకు మైక్ సెట్, డెస్కులు, బెంచీలు అందించారు. వంట గది, తాగునీటి పైప్‌లైన్ నిర్మించారు. మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు.

కమిటీతో కార్యరూపం..

చేయూత అపూర్వం

కమిటీ గౌరవ సలహాదారుడైన నాటి ఎమ్మెల్యే సమక్షంలో 2005లో పూర్వ విద్యార్థుల కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా జొన్నల రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా వై.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా ఖాజా మోయినుద్దీన్, సంయుక్త కార్యదర్శిగా జి.వెంకటయ్య, కోశాధికారిగా నాగబండి వెంకట్రాంనర్సయ్య, కన్వీనర్‌గా హెచ్ఎం కె.విజయ, సభ్యులుగా గుర్రం యాదగిరి, కె.శ్రీనివాస్, గట్టు రాజయ్య, మంగు జయప్రకాష్, పార్సీ కమల్ ఎన్నికయ్యారు. అలాగే పూర్వ విద్యార్థులైన ఎన్ఆర్ఐ తోట రవీందర్ రూ.50వేలు, ఎన్ఆర్ఐ కుందురు శ్రీనివాసరెడ్డి రూ.20వేలు, చింతకుంట్ల శైలేందర్ రెడ్డి, గట్టు రమేశ్ రూ.20 వేలు, కొంతం శ్రీను రూ.20 వేలు, ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య రూ.10 వేలు, గోలి వాసు దేవరావు, మంగు జీవన్, చిలువేరు లక్ష్మణ్, సదానందం, ఎం.భీష్మాచారి రూ.10వేలు ఇలా ఇంకా ఎంతో మంది విద్యార్థులు తమ వంతు విరాళాలు అందించారు.


పూర్వ విద్యార్థులు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్



టెన్త్ మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందిస్తున్న కమిటీ నాయకులు

పాఠశాల అభివృద్ధి కృషి

- రాజేశ్వర్‌రావు, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు



గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు బాగా చదువుకోవాలన్నదే మా లక్ష్యం. అందుకే మా వంతు బాధ్యతగా మేం చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. విద్య, చదువులో ప్రతిభ చూపే విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. మున్ముందు కూడా మా పూర్వవిద్యార్థుల కమిటీ ద్వారా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటాం.

కమిటీ కృషి ఆదర్శనీయం

- కె. రమేశ్, జీహెచ్ఎం, శివునిపల్లి హైస్కూల్



పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు పూర్వవిద్యార్థులు చేస్తున్న కృషి ఆదర్శనీయం. ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే తీర్చడానికి ముందుంటున్నారు. పేద విద్యార్థులకు, క్రీడాకారులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. పదవ తరగతి ఫలితాల్లో మెరిట్ సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేలా బహుమతులు అందిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఈవో



జవాబు పత్రాలను పరిశీలిస్తున్న డీఈవో రాము

దేవరుప్పుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 (సంగ్రహణాత్రక మూల్యాంకనం-1) పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. బుధవారం మండలకేంద్రంలోని శ్రీసాయి ప్రశాంత్ విద్యానికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తోటకూరి కృష్ణ, ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలి

జనగామ కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎన్‌పీడీసీఎల్ జనగామ ఎస్‌ఈ టి.వేణుమాధవ్ అన్నారు. బుధవారం జనగామ మండలం యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐటీ)లో ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. 'విద్యుత్ ప్రమాదాల నివారణ - తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అంశం పై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. భవనాలకు ఎర్తింగ్, విద్యుత్ పరికరాల ఏర్పాటు, రక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామలీల ప్రవచనం



బాలబ్రహ్మానందస్వామీజీకి ఫలహారాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

లింగాలఘణపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండలంలోని సుప్రసిద్ధ నవాబుపేట శ్రీకోదండరామ స్వామి ఆలయంలో బాలబ్రహ్మానంద స్వామీజీ, నైమి శరణ్యస్వామీజీల ఆధ్వర్యంలో బుధవారం శ్రీరామలీల ప్రవచన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీ, సీనియర్ అసిస్టెంట్ రాజేందర్‌రెడ్డి, ఎల్లగౌడ్, రమేశ్, రవితేజ, అశోక్ వసంత, అర్చకులు లక్ష్మీనర్సింహ్మాచార్యులు, రాపర్తి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు వాటర్ డిస్పెన్సరీ వితరణ



వాటర్ డిస్పెన్సరీ అందిస్తున్న దాత మోహన్‌దాస్

జనగామ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలం పెంబర్తిలోని ఎంజేపీ మహిళా డిగ్రీ కళాశాల (స్టేషన్‌ఘన్‌పూర్)కు ఆర్.మోహన్‌దాస్ అనే దాత విద్యార్థినుల సౌకర్యార్థం వాటర్ డిస్పెన్సరీని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎస్. చారి మాట్లాడుతూ సమాజంలోని దాతలు, సేవా సంస్థలు ముందుకొచ్చి గ్రంథాలు, బోధనా పరికరాలు, జిమ్ పరికరాల వంటి ఉపయోగకరమైన వస్తువులను పేద విద్యార్థులకు సమకూర్చి వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఎటీపీ మాధురి, డిప్యూటీ వార్డెన్ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.



వడ్లకొండ, గానుగుపహాడ్ శివారులోని వాగుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెన



ఉప్పుగల్లు - తమ్మడపల్లి(ఐ)ల మధ్య కోతకు గురై ప్రమాదకరంగా ప్రధాన బీటీ రోడ్డు

ఆదమరిస్తే అంతే..

● ప్రమాదకరంగా రోడ్డు, బ్రిడ్జి ● పట్టించుకోని అధికారులు ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

జనగామ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రం నుంచి నర్మెట్ట, తరిగొప్పుల, కరీంనగర్, హుస్నాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి అది. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఈ రహదారి వెంట ప్రయాణిస్తారు. జనగామ మండలంలోని వడ్లకొండ, గానుగుపహాడ్ శివారులో ఉన్న వాగుపై ఉన్న కల్వర్టు గత రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ప్రయాణికుల సౌకర్యం కోసం తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు ఉన్న రోడ్డు కాస్త పూడిక పడి కృంగిపోయింది. ఈ రహదారిలో రాకపోకలు సాగించాలంటే కత్తి మీద సాము లాగా తయారైంది. అధికారులు పైపులతో తాత్కాలిక రోడ్డును వేశారు. యేండ్లు గడుస్తున్నా కూడా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. కాంట్రాక్టర్ పిల్లర్లను లేపి రోడ్డుకు సమాంతరంగా స్లాబ్ వేయ కుండానే వదిలేశాడు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మా ణ పనులు పూర్తి చేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా బీటీ రోడ్డు

జఫర్‌గఢ్ (ఆంధ్రజ్యోతి) : జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లు - తమ్మడపల్లి(ఐ) గ్రామాల మధ్య గల ప్రధాన రహదారి కోతకు గురై ప్రమాదకరస్థితిలో ఉంది. ఉప్పుగుల్లు నుంచి తమ్మడపలి (ఐ)తో పాటు జఫర్‌గఢ్ మండల కేంద్రానికి ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటారు. అలాగే రైతులు వ్యవసాయ పంట క్షేత్రాల వద్దకు నిత్యం ఈ దారి గుండానే వెళుతుంటారు. గత ఏడాది కురిసిన వర్షాలకు ఈ రహదారి మరింత కోతకు గురై లోయలా ఏర్పడింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో అడపా దడపా కురుస్తున్న వర్షాలకు మరింత కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం గుండా వెళ్లాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. బీటీ రోడ్డు అంచున లోయగా ఏర్పడిన ఈ రహదారి గుండా రాత్రి పూట వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నామని, ప్రమాదాలు చోటు చేసుకోకుండా రోడ్డు మరమ్మతు చేయాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీలో మండలానికి పెద్దపీట

రఘునాథపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం నూతన జిల్లా కమిటీలో రఘునాథపల్లి మండలానికి పెద్దపీట వేశారు. ఈ సం దర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు మండల కేంద్రంలో బుధవారం జరిగి న కార్యక్రమంలో హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా కమిటీలో ముఖ్య సలహాదారులుగా మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన గజ్జి వీర వజ్రయ్యతో పాటు మండల కేంద్రానికి చెందిన శ్యాంశెట్టి శంకరయ్య నియమితులయ్యారు. వీరితో పాటు జిల్లా కమిటీలో మండలా నికి చెందిన అయితా జయరాములు, కూరెళ్ల పెద్ద ఉపేందర్, తుమ్మలపల్లి సోమేశ్వర్, గందె లిరిల్‌కుమార్, పల్ల వెంకటరమణ, ఓరుగంటి శంకర్ లింగం, కాసం బాలకృష్ణ, పజ్జూరి రాజు, దుద్దెల రాజేందర్, బచ్చు శ్రీనివాస్, కూరెళ్ల చిన్నఉపేందర్, మహిళ విభాగంలో కూరెళ్ల ఉషారాణి, తుమ్మలపల్లి లావణ్య, ఓరుగంటి శోభారాణి, పడకంటి మంజుల, బచ్చు శ్రీలక్ష్మికి స్థానం కల్పించారు. జిల్లా కమిటీలో మండలానికి చెందిన వారికి అవకాశం కల్పించడంపై సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పోకల శివకుమార్, జోనల్ ఛైర్మన్ తుమ్మలపల్లి సోమేశ్వర్ నూతన జిల్లా కమిటీ అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్ ఉమ

దేవరుప్పుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్ దాసగాని ఉమ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలు, విద్యార్థి నులపై జరుగుతున్న అఘాయిత్యాలపై చర్యలు తీసుకోకుంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. లైంగిక వేధింపులపై మహిళా భద్రత చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రోజురోజుకూ మహిళలపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలు పెరిగి పోతు న్నాయన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో మెరుగ్గా పనిచేస్తున్న తరుణంలో ఇలాంటి సమస్యలు మహిళలకు ఎంతగానో ఇబ్బందికరంగా మారాయన్నారు. పాలక వర్గాలు తక్షణమే రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో మహిళలపై ఇలాంటి దాడులు జరుగకుండా ప్రత్యే కంగా చర్యలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కీర్తన, మానస, ధన్వంతి, చందన, కావ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివరాజ్ యాదవ్

జనగామ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులకు అండంగా నిలిచే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో, మండలంలోని ఎర్రకుంట తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం శివరాజ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ గిట్టుబాటు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి, కొల్లూరి నర్సింహులు. మోహన్, శ్రీలతరెడ్డి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆరూరి శ్రీనివాస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆరూరి శ్రీనివాస్

చిలుపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26న వరంగల్ నగరంలో నిర్వహించే ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆరూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముప్పై ఏళ్ళ న్యాయ పోరాటాన్ని గుర్తించిన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిందని, తీర్పుకు అనుకూలమని మొదటగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, మరోవైపు ఉద్యోగ నోటిఫికేషన్లు వేయడం దుర్మార్గమన్నారు. 26న నిర్వహించే సభకు పెద్దసంఖ్యలో మాదిగలు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నలిమెల నాగరాజు, కుమారస్వామి, రాజయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సారయ్య



లింగస్వామి

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కమిటీలో స్థానం

జఫర్‌గఢ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ అనుబంధ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడుగా మండలంలోని కూనూరుకు చెందిన ఇల్లందుల సారయ్య, జఫర్‌గఢ్ మండల కేంద్రానికి చెందిన గడ్డం లింగ స్వామి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. వీరు పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు రడపాక ప్రదీప్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన జిల్లా, మండల కమిటీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వకర్మ యోజన సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లను అందజేస్తున్న కౌన్సిలర్ హరిచంద్ర గుప్త

జనగామ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ యోజన పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు జనగామ జిల్లా కేంద్రంలో రైల్వేస్టేషన్ ఆవరణలో స్థానిక కౌన్సిలర్ మహంకాళి హరిచంద్రగుప్త సర్టిఫికెట్లు, ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వెనుకబడిన కులవృత్తుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కులవృత్తులు చేసుకునే వారికి వ్యాపార అభివృద్ధి కోసం తక్కువ వడ్డీకి ఎలాంటి పూచీకత్తులేకుండా రూ. 3లక్షల రుణం మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సౌద రమేశ్, వీరలింగం, రవి, ప్రసాద్, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రెండు వైన్స్‌షాపులపై కేసులు నమోదు

● ఎస్టీఎఫ్ డీటీం సీఐ చెరుకు నాగరాజు వెల్లడి

నెల్లికుదురు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీ ధరల కంటే అధికరేట్లకు మద్యం విక్రయిస్తున్న జిల్లాలోని రెండు వైన్స్ షాపులపై బుధవారం స్టేట్ టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించి, ఆ షాపులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్టీఎఫ్ డీటీం సీఐ చెరుకు నాగరాజు తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గూడూరు మండల కేంద్రంలోని గణేష్‌వైన్స్, కొత్తగూడ మండల కేంద్రంలోని శివసాయి వైన్స్‌షాపుల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా విక్రయిస్తున్నారని సమాచారంతో ఆ షాపులపై దాడులు నిర్వహించినట్లు చెప్పారు. గూడూరు గణేష్ వైన్స్‌లో కింగ్ ఫిషర్‌లేజర్ బీర్‌కు ఎమ్మార్పీ ధర రూ.150 ఉండగా అదనం రూ.20 కలిపి రూ.170కి, ఆఫీసర్ చాయిస్ రిజర్వ్ విస్కీ రూ.150 ఎమ్మార్పీ ధర ఉండగా అదనం రూ.15లు కలిపి రూ.165కు విక్రయిస్తున్నారని తెలిపారు. కొత్తగూడ శివసాయి వైన్స్‌లో ఆఫీసర్ చాయిస్ రిజర్వ్ విస్కీ రూ.150 ఎమ్మార్పీ ధర ఉండగా అదనంగా రూ.10 కలిపి రూ.160 కి విక్రయిస్తున్నట్లు సదరు షాపుల నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాధిత కుటుంబానికి సుందర్‌రామ్‌రెడ్డి పరామర్శ



సోమనర్సమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా సుందర్‌రామ్‌రెడ్డి

దేవరుప్పుల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాపురంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు పోతుగంటి యాదగిరి, ఉప్పలయ్యల మాతృమూర్తి సోమనర్సమ్మ అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు బస్వ మల్లేశం, అనంతోజు కృష్ణమూర్తి, గ్రామశాఖ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై సంఘటితం కావాలి



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సంఘం మండల అధ్యక్షుడు నవీన్, ప్రతినిధులు

జఫర్‌గఢ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం నాయీ బ్రాహ్మణులు సంఘటితం కావాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాముల నవీన్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తిడుగులో సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నవీన్ మాట్లాడుతూ తరతరాలుగా వృత్తినే నమ్ముకుని నాయీ బ్రాహ్మణులు దయనీయ జీవితాలు గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను నాయీ బ్రాహ్మణులకు వర్తింపజేయాలన్నారు. సబ్సిడీ రుణాలను అందించి ఆదుకోవాలన్నారు.

కాగా, సమావేశంలో తిడుగు నాయీ బ్రాహ్మణుల సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీరాముల రవిందర్, గౌరవ అధ్యక్షుడిగా సదానందం, ఉపాధ్యక్షుడిగా ముత్తిలింగం, ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య, కోశాధి కారిగా శ్రీరాముల రాజు, సహాయ కార్యదర్శులుగా అనిల్, సమ్మయ్య, సలహాదారుగా అలువయ్యలతో పాటు పలువురు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సమావేశంలో సంఘం మండల ప్రతినిధులు సింగారపు యాకయ్య, రమేశ్, యోగేశ్వర్, కొత్వాల కుమార్, శ్యామ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

కొడకండ్ల అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడోనికుంట తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బానోత్ రవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటివద్ద చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలిసిన ఎంఎల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు డి.సురేష్ నాయక్ ఆధ్వర్యంలో నాయకులు ఆయన ఇంటికెళ్లి రవిని పరామర్శించారు. ఈ సందర్భంగా రవితో ఫోన్‌లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడి ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో మసురం రవీందర్, బత్తుల వెంకన్న, సోమన్న, మచ్చమల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు

భయాందోళనలో వాహనదారులు



దట్టంగా చెట్లు పెరగడంతో ప్రమాదకరంగా మారిన మూలములుపు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని మీదికొండ నుంచి కొత్తపల్లి మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల చెట్లపొదలు దట్టంగా పెరిగి వాటికి తోడుగా మలుపులు ఉండడంతో రోడ్డు మీదుగా నిత్యం వెళ్లే వాహనదారులు జంకుతున్నారు. మూలమలుపు దాటే వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. నిత్యం రఘునా థపల్లి మండలంలోని గోవర్ధనగిరి జాతీయ రహదారి వద్ద నుంచి మీదికొండ మీదుగా కొత్తపల్లి, చిలు పూరు మండలంలోని అనేక గ్రామాలకు, హుస్నాబాద్, హుజురాబాద్ ప్రాంతాలకు వెళ్లే వారు షార్ట్‌కట్ లో ఈ రోడ్డు మీదుగా వివిధ వాహనాలలో వెళ్తుంటారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్నటువంటి చెట్లు ఏపుగా పెరిగి రోడ్డు పైకి వచ్చి వాలాయి. దీంతో రోడ్డు పూర్తిగా ఇరుకుగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. రోడ్డుకు ఇరువైపుల భారీగా చెట్లు పెరుగడంతో గతంలో ప్రమాదాలు జరగడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండాపోయిందని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పం దించి మూలమలుపుల వద్ద పెరిగిన చెట్లపొదలను తొలగించి ప్రమాదాలు జరుగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 23: డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన పాలకొండ వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందగా మృతుని కుటుంబానికి ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం నాయకులు బుధవారం చేయూత ఇచ్చారు. సంఘంతో పాటు డాక్టర్ మోతె రాజు, బాలాజీ మెడికల్స్ ఆధ్వర్యంలో రూ.33 వేలు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.గట్టయ్య, ఆడెపు కుమారస్వామి, వి.కుమారస్వామి, ఎస్.కుమారస్వామి, పి.చంద్రమౌళి, సామల ఉపేందర్, గట్టుమల్లు, పిట్ట శ్రీనివాస్, జోగు నాగేశ్వర్, జి.రాజు, ఎ.రమేశ్, పి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.